# రొజా

## టేకుమళ్ల కామేశ్వరరావు

ఆ రొజా[1]ని ఎన్నిసార్లు బండీ తోలలేదు! పొట్టి ఎఱ్ఱెద్దుల బరువు బండీ కొండల మీంచి ఊడిన బండరాయి లాగుదొర్లి వచ్చేది. తను ఒక్కడే తోలుతున్నాడా! గూడెం దొరలందరూ వెదుళ్ళబళ్ళు నిత్యమూ తోలుతూనే ఉంటారు; రొజా మంచిదని కాదు. రొజా మంచి దేమిటి! మంచి దంటూ కూడా ఉంటుందేమిటి! మన్నెంలో రొజాలంతే! వెల్లడి బళ్ళదారులా ఇవి! బొఱ్ఱన్నదొరకి తన ఎద్దుకాలు గాక తనకాలు విరిగిందనిపించింది. ఉపద్రవం కోపమూ, విచారమూ వేశాయి; ఎద్దు బాధకోసం విచారమూ, గొడ్లని కోసుకు తినేజాతి అయితేయేం! రొజా మీద కోపమూ! దొర ఎద్దు మెడ మీంచి కాడి ఎత్తడం మాట అటుంచి, ఏ బండ రాయి తగిలి ఎద్దు కాలు విరిగిందో ఆ రాతిని కసిదీర, కాలు దిమ్మెక్కే వరకూ తన్నేడు. "ఉండు నీ పనిచెప్తా" అని కోపం లోపల అణిచివేసి చెయ్యిమట్టుకు ఆడించాడు. ఒక క్షణం యోచించగా దొరకి రొజా అంతా కూడా విచిత్రంగా కనపడింది.

"ఈ రొజాలో పుట్టింది లగాయతు ఇప్పటిదాకా కళ్ళుమూసుకునే బండితోలేనా, పిచ్చివాణ్ణై బండీతోలేనా!" అని ఆశ్చర్యం మొలకెత్తింది. "దొరలందరూ పిచ్చి వెధవలే! అబ్బా! ఇంతమందీ ఎంత అవివేకంగా బాధపడుతున్నారు! ఊబి[2]లోంచి ఎడ్లతోకలు ఎంతమెలివేసి, ఎంత బాధపెట్టి, ఈడవలేని వెదుళ్ళబళ్ళని ఈడిపిస్తారు! కోయజాతికి తెలివి తేటలు లేకపోవడమే కాకుండా గుండె కూడా లేదు కదా! జంతువుల్ని కోసుకుతినే జాతని నిజంగానే అనిపించుకుంది" అని బొఱ్ఱన్న దొర తనకి కలిగిన నూతనదృష్టితో జాతినంతా విమర్శించి ఆశ్చర్యపోయి నిలుచుండిపోయాడు.

దొర శ్రమపడి వెలుపటెద్దు మెడతాడు విప్పి కాడి తప్పించాడు. ఎద్దు బాధపడుతూనే లేవలేక లేవలేక మూడు కాళ్ళమీద నిలుచుంది. ఎద్దుని చూస్తూన్నకొద్దీ దొరకి వెఱ్ఱి ఉద్రేకం పుడుతూంది. రొజా అంతా తలలో సినీమా ఫిల్ములాగ తిరిగిపోయింది. రాజవొమ్మంగి రోడ్డు నుంచి రొజా మొదలుపెట్టింది మొదలు లాగరాయి వరకూ అతని కళ్ళ ముందర మంత్రశక్తి వల్ల వేరు[illegible]క్క నడిచినట్టు నడిచింది. మొదట ఒక మనిషికి సరిపోయిన దారిలాగు కనబడే ఆ రొజాలో బండీ నడిపించాలి. ఎడ్లతట్లని డొంకలు, కొమ్మలు గీసుకొంటూంటాయి. కొమ్మలు చక్రాల ఆకుల మధ్యపడి అడ్డుతాయి. సరేసరి, బండికీ గూడు ఉండభయం! పక్క కొమ్మలు, పై కొమ్మలు వెదురుగూటిని చదరంత లేకుండా చేసివేస్తాయి. నిరుడు గంగా దేవి జాతరకి దొర తనకూతురిని వాతంగి నుంచి తీసుకువస్తున్నాడు. దారిలో కొంతదాకా వాన. వానలో కాస్తోకూస్తో తడిశారు. వాన వెలిసింది. పక్క కొమ్మలకి గూడు చిరిగిపోతూంది. గూడుకి పై కొమ్మలు తగలగా బండిలో కుండెడు

నీళ్ళు చిమ్మరించినట్లు పడి వానలో కంటే ఎక్కువగా తడుస్తున్నారు. అది కూడా చాలక ఒక చింతకొమ్మ బండీలో దూరి గూడు గూడూ లేచిపోయింది. కూతురిని అర చేతులమీద పెట్టుకుని తెద్దా మనుకున్నాడు బొర్రన దొర, అప్పటి స్థితిచూసి ఒక క్షణం విచారమనిపించింది; కాని అంతకంటే అప్పుడు మరేమీ అనిపించలేదు. ఇప్పుడో! అదృశ్యం తలపుకిరాగా ఒంటిని జెర్రులు పాకినట్లు గగుర్లు ప్రవహించాయి. గూడుని తన పొట్టనిపెట్టుకొన్న చింతకొమ్మ ఇంకా అలాగే ఉంది. చూపు మేరదూరంలోనే ఉంది. తనవేపే చూస్తుంది. దొర బండీ అవతలవేపుకి వెళ్ళాడు. బండీ తడికలో ఇరికించిన కత్తి పైకిలాగాడు. బయలుదేరాడు. చింతచెట్టు ఎక్కాడు. ఆ మొండి చింతకొమ్మని రెండు దెబ్బలలో నేలమీద పడవేశాడు. ఎంత పిచ్చి కోపంతో కొట్టేడో ఏమిటో! అతను చెట్టుదిగి శాంతించి తిరిగి బండీ దగ్గరికి వచ్చాడు. రెండో ఎద్దుని కూడా విప్పాడు. ఎడ్లని నెమ్మదిగా ఇంటివేపు తోలాడు. కాలు విరిగిన ఎద్దు కోసం అక్కడక్కడ ఆగుతూ వీధి[3]కి రెండు ఝాములకి వెళ్ళాడు.

వీధిలోఉన్న చుట్టాలంతా ఎద్దుని చూశారు. "ఓస్! ఇంతేట్రా!" అన్నారు. బొర్రన్న దొర కడుపులో ఉన్న సంగతి ఎవరికీ చెప్పలేదు. కోయదొరాయె! కళ్ళతోనే గాని నోటితో మాట్లాడతాడా! అందులో ఉద్రేకం మీద ఉన్నాడు. గూడెం దొరలంతా ఎద్దుని చంపి పంచి వేసుకున్నారు. ఆ సాయంత్రం మరో ఎద్దుని కూడా తోలుకువెళ్ళి బండీ వెదురు ఏలేశ్వరంలో సాహుకారికి బొర్రన్నదొర అప్పజెప్పాడు. సాహుకారు "ఎప్పుడు మళ్ళీ తోలుకొస్తావు?" అన్నాడు. "ఏమో?" అన్నాడు దొర ముక్తసరిగా. "అదేమి?" అన్నాడు శెట్టి గారు. "ఎద్దుకాలు విరిగిపోయింది!" అన్నాడు దొర, కోయయాసతోటి. ఏ యెద్దు, ఇదా, మరొకటా, ఎక్కడ, ఎంచేత, ఎప్పుడు అనే విషయాలు శెట్టి అడగాలేదు, దొర చెప్పాలేదు. సాహుకారు "మరొక దానితో తీసుకురా!" అన్నాడు. దొర మాట్లాడలేదు. శెట్టిగారు అంతకంటే అడగలేదు; వాడే తెస్తాడని ఊరుకున్నాడు. వెదురు దింపివేసి బొర్రన్న దొర సాయంత్రం గూడానికి బండితోలుకుపోయాడు. బాపన్న దొర "అన్నా! వెదురుకెప్పు డెళదాంరా!" అన్నాడు. "రాను" అన్నాడు బొర్రన్న దొర. "ఏంరా?" అని ప్రశ్నించాడు బాపన్న దొర. "సెప్పుతానులే!" అన్నాడు దొర కోయయాసతోటి.

మన్నాడు పొద్దున్న బొర్రన్న దొర మచ్చుబుడప[4] అవతల ఉన్న సొంత చలకకి మామూలు ప్రకారం వెళ్ళి గంటెలచేను ఏపుగా ఉండడం చూసి ఆనందపడ్డాడు. బొర్రన్న దొరకి ఇప్పుడున్న కొత్తయోచనల మీద చేనుమధ్య ఉన్న మోళ్ళు తలపుకి వచ్చాయి. ఆశ్చర్యపడ్డాడు. తను అంత వరకూ మనిషేనా అనుకొన్నాడు. "కాని వాటిపని ఇప్పుడు కాదు. మరొకసారి వేళ్ళతో పెల్లగించి పారేస్తాను" అనుకున్నాడు. అతను తిరిగి ఇంటికి వచ్చాడు. గంటెల జావ తనూ పెళ్లామూ అర్ధకలిగా తిన్నారు. వేటకి వెళ్ళే అదను గాక పోవడంచేత మాంసం లేదు. గంటెలచేను పండాలి. మళ్ళా కడుపునిండా తినాలి! గంజితాగేక దొర గోచి తిన్నగా పెట్టుకున్నాడు, కోయవాడికి ఒంటిమీద ఉండే గుడ్డముక్క అదొక్కటే! కత్తితీసుకొని అనుకున్న పనిమీద బయలుదేరాడు. గూడెం ముందర రొజాలో ఉన్న తాటి మొక్కల కమ్మలు కొట్టివేశాడు. ఎగువని ఉన్న ఊడుగుచెట్ల మెరుస్తూన్న ఆకులు గల కొమ్మలు రొజామీదికే వాలిఉన్నాయి. ఆ కొమ్మలు నరికివేశాడు. ఆ పైని నల్లరేగి కొమ్మలు రొజాని పై నుంచి కప్పుతున్నాయి. నాలుగు దెబ్బలలో చెట్టునే నరికి అవతలపారవేశాడు.

చెట్లు నరికే నేర్పు కోయవాళ్ళది. అందులో బొర్రన్న దొరది. ఎగువని రొజాలో చక్రాలగాళ్ళు లోతుకిపోయి మధ్యని మనిషి కూచునేవలకి తగలుతూన్నదిమ్మ ఒక అరఫర్లాంగు మేరవరకూ ఉంది. "దానిపని ఇప్పుడు కాదు. మొదట కొమ్మలపని, తర్వాత మోళ్ళపని. ఆ తర్వాత దిమ్మల పని, ఆ తర్వాత రాళ్ళు ఏరెయ్యడం. అటు తర్వాత బండరాళ్లపని, ఆపైని ఊబిపని" అనుకున్నాడు దొర. కాని అంతటిలోనే బుద్ధిమారిపోయింది. "అన్నీ చేసుకుంటూనే రాజవొమ్మంగి రోడ్డు జేరుకోవాలి" అని గభీమని నిర్ణయించుకున్నాడు. వెంటనే తాను బాగుచేసినంత మేరలో పడి ఉన్నరాళ్ళు ఏరి వెయ్యడానికి పూనుకున్నాడు. ఆరాళ్ళు కంటికి కనబడగా బొర్రన్నదొర కడుపునిండా నవ్వుకున్నాడు. అసలే కోయవాని నవ్వు! అందులో బొర్రన్న దొరది సాటిలేని నవ్వు! కొంతసేపటికి చిరునవ్వుకి తగ్గింది. "ఈరాళ్ళ మీదే కదా నా ఎడ్లునడిచేవి! నా బండీ ఎగిరి ఎగిరిపడేది! ఇన్నాళ్ళూ ఎలా నడిపించాను అబ్బా!" అని ఆశ్చర్యపడ్డాడు. అతను తనలో వనదేవత ప్రవేశించిందేమిటి చెప్మా అని ఎంతో ఆశ్చర్యపోయాడు. తర్వాత ఆ రాళ్ళను ఏరి అడవిలో ఇటూ అటూ పారవేశాడు. పెద్దకొండ అవతలకి సూర్యుడు చల్లగా జారాడు. ఎక్కడో మైలు దూరాన్ని అడవిలో గాలి వీచడం బయలు దేరిన చప్పుడయింది. గువ్వలజతలు గూళ్ళకి ఎగిరిపోతున్నాయి. బుడప విడిచి బండలు[5] చేలకోసం వెతుకుతున్నాయి. బొర్రన్న దొర గుడిసెకి బయలు దేరాడు, చేరుకున్నాడు. ఎవరినీ పలకరించలేదు. ఏదో ఇంత గంజి తాగేడు. గంటెల చేనుని జీవాలు పాడు చెయ్యకుండా వడిసెలతోటీ, కత్తితోటి చేను కాపలాకి బయలు దేరాడు. వెన్నెలలో గంటెల చేను నిశ్శబ్దంగా చల్లని మంచు తాగుతూంది. దొర అరప[6] ఎక్కాడు. మధ్యమధ్య చప్పుడు చేస్తూన్న దుప్పులని, కొండ గొర్రెలని, కణుసులని, అడివి పందులని, కుందేళ్ళనీ కేకలతోటీ, డబ్బా రేకులతోటీ, వడిసెలతోటీ బెదిరిస్తున్నాడు. ఆ పని ఆ పేటప్పటికి రొజా ఎలాగ బాగుచెయ్యాలి అనేదృష్టి! తెల్లవారుతూండగా దొరకి మంచి నిద్రపట్టింది. పొద్దెక్కి కాని లేవలేదు. వీధికి బయలు దేరాడు.

అసలే కోయదొర! అందులో ఇప్పుడు పనిమీద ఉన్నాడు! ఇంక అసలు మాట్లాడతాడా! మూగినోము పట్టివేశాడు బొర్రన్నదొర. మునసబు లచ్చన్న దొర బొర్రన్న దొరని పలకరించాడు. బొర్రన్నదొర నోటిలోంచి ఏవో రెండుమాటలులాగి "ఆరై గారు వస్తా" రంటూ మునసబు వెళ్ళిపోయాడు. బొర్రన్నదొర దూడనివిప్పి ఆవుని పాలు పితికేడు. గిద్దెడు చుక్కలూ ఆరైగారికోసం మునసబు ఇంటికి పంపాడు. దొర రోజుకి ఒకసారే పాలు పితుకుతాడు. అసలు అతని ముందుతరం వాళ్లు ఆవులని పాలు పితుకుతారని ఎరగరు. దూడలకోసమే ఆవులని పెంచడం. ఇప్పుడు రవ్వంత తెలుగు మీరి వీధి అంతా పాలు పితుకుతున్నారని మురాదారు[7] గోలచేస్తున్నాడు. ఇంతకీ వీధిఅంతా పాలు పితికితే రోజుకి రెండుశేర్లు అవవు. బొర్రన్నదొర ఆవు పాడి గల ఆవులలో ఒకటి. గిద్దెడు పాలు ఇస్తుంది. మరి కొంతసేపటికి దొరవేలు విడిచిన చెల్లెలికొడుకు మొర్రెందొర వచ్చాడు. గొడ్లని విప్పి అడివికి తోలుకుపోయాడు.

బొర్రన్నదొర పాదు[8] పైకి తీశాడు. గంటెలు పేరుకే ఉన్నాయి గుడిసెలో. పిట్టలేకపోతే మాడడమే. అందుచేత పాదు పైకితీసి ఉచ్చులకి ఆముదం రాశాడు. కత్తి, గునపం, పార ఒకచేత, రెండోచేతితో చదలకోడి - షికారీపిట్ట[9] -పంజరం, పాదు, పట్టుకుని బయలుదేరాడు. రొజా మీద గునపం, పార విడిచిపెట్టి, కత్తి ఒకచేత, పంజరం, పాదు రెండో చేతిలో పట్టుకుని, అడివిలోకి

ఫర్లాంగుదూరం వెళ్లి, ఎత్తుపల్లాలు లేనిచోట పాదు అమర్చి, గంటెలు చల్లి, కైవారం మధ్యని షికారీపిట్ట పంజరం పెట్టి, పదిగజాల దూరంలో వెదురుపిడెం పక్కని దాక్కున్నాడు. మరి కొంతసేపటికి షికారీ పిట్ట కూత మొదలు పెట్టింది. అడివి చదల కోళ్ళు వచ్చాయి. పాదుమధ్యని వాలేయి, బొర్రన్నదొర నెమ్మదిగా చప్పట్లుకొట్టాడు. 'హుస్! హుస్!' అన్నాడు. కోళ్ళు పరుగెత్తాయి. రెండు కోళ్ళ మెడలు ఉచ్చులలో చిక్కుకున్నాయి. రెండు తప్పించుకుపోయాయి. చిక్కుకున్న కోళ్ళ మెడలు నులిమి వేసి మంగంలో పెట్టి, వస్తువులు తీసుకొని రొజా దగ్గరికి వచ్చాడు. సాయంత్రం వరకూ దిమ్మని పట్టించాడు. మట్టిదిమ్మ అయినా చిట్టంరాయిలాగ ఉంది. అందుచేత ఎంతో శ్రమపడ్డాడు. సాయింత్రం వరకూ ఒళ్ళు హూనం చేసుకొని కొంత పనిచేశానుకదా అని పరమానందం పొంది, పనిచాలించి గూడానికి బయలుదేరాడు.

దొరపని చేస్తూన్నప్పుడు పుల్లన్నదొర అడివిలోనే కలపకొడుతున్నాడు. బొర్రన్నదొర చేస్తూన్నపని అంతా చూశాడు. అతను గూడెంలో ఉన్న సంగతి చెప్పాడు. మునసబు బొర్రన్న దొరదగ్గరికి వచ్చాడు. "అన్నా! మనకెందుకా పని. సర్కారోళ్ళు చేసుకుంటారు. ఎందుకాపని మనికి, ఊరుకో" అన్నాడు. బొర్రన్నదొర "ఎద్దుకాలు విరిగింది" అని ఒక్కముక్కలో సమాధానమిచ్చాడు. "నీకు తెలియదూ! ఎద్దుకాలంటావు! ఎన్నిసార్లు బళ్ళు తిరగబడిపోలేదు! ఎన్నిసార్లు ఎడ్లు చావలేదు! ఎన్నిసార్లు చక్రాలు విరిగిపోలేదు! నీకు తెలియదూ! నీ ఎద్దంటావు!" అని ఆక్షేపణగా అన్నాడు. "మన తెలివి అలాగుంది? రొజా బాగుంటే?" అన్నాడు దొర. "యుగయుగాల నుంచీ లేంది ఇప్పుడు వచ్చిందా!" అన్నాడు మునసబు. బొర్రన్నదొర తానుచేసిన పనిని గురించి ప్రశంసకోసం తొందరపడుతున్నాడు. కాబట్టి "తమ్ముడూ! వీధిముంగల రొజా ఎలాగుంది?" అన్నాడు. "దానికేం! గచ్చు రోడ్డులాగుంది!" అన్నాడు మునసబు. దొర ఉబ్బిపోయాడు ఆనందంతో. అసలే నోరు మూత పడిపోయింది. మరికొంతసేపు ఇద్దరూ ఫారెస్టు ఇలాఖావాళ్ళని గురించి మాట్లాడుకొని ఎవరిదారిని వారు వెళ్ళిపోయారు.

బొర్రన్నదొర కొన్నిరోజులలో దిమ్మని చెక్కి వేసి దాని అవతల ఉన్న ఊబిని బాగుచెయ్యడం మొదలుపెట్టాడు. ఆ ఊబిలో బండీచక్రాలు కుంచం వరకు దిగబడిపోతున్నాయి. ఎంతోకష్టపడి రాళ్ళుమోసి ఆ ఊబిలో పడవేశాడు. దాని మీద గులకరాళ్ళు వేసి, ఇంత ఎర్రమట్టిపోశాడు. ఊబి కప్పడిపోయింది. ఆస్థలం మీంచి బళ్ళు సాపుగాపోతూండగా అతను చూసి పట్టలేని ఆనందం పొంది, గంగాదేవిని ధ్యానించాడు.

ఎగువని కొంతవరకు రొజా మధ్యని చెట్లమోళ్ళు ఉన్నాయి. ఈమోళ్ళు ఒకొక్కప్పుడు ఎడ్లకాళ్ళకి తగులుతాయి. ఒక్కొక్కప్పుడు చక్రాలకి తగులుకొని నానా ఇబ్బందీ పెడతాయి. కొన్నాళ్ళపాటు బహుశ్రమపడి ఆ మోళ్ళని ఒకటితర్వాత ఒకటిగా నేల మట్టం చేశాడు.

గంటలచేను పంటకి వచ్చింది. పందిళ్ళని, దడులని, పాదలని బీరకాయలు, పొట్లకాయలు, ఆనపకాయలు కాస్తున్నాయి. వాటివాటి కొత్తలు[10] చేసుకుంటేనే గాని అవి తినకూడదు. ఎన్నిపండితే ఏమిటి! ఒకనాటి సాయంత్రం దొరసాని "ఇంట్లో ఏగుడ్డూ లేదు" అంది.దొర మాట్లాడకుండా గజం[11] తో తుపాకీలో మందు దట్టించి గుండు పడవేసి చలకకి బయలుదేరాడు. తెల్లవారేవరకూ చేను కాపలాకాశాడు. చేనుచుట్టూ పరిశీలించి, అంతకి కాస్తసేపు కిందటే దుప్పి నడిచిపోయినట్లు

గడ్డిమీది మంచుబొట్లని చెదరగొట్టిన అడుగులని చూసి, తెలుసుకొని, తుపాకీకి కేపు తగిలించి, అడుగుల జాడనే మచ్చ బొడకి వెళ్ళాడు. ఏభైగజాల దూరంలో పాలమొక్క పక్కని ఒంటిదుప్పి మేస్తూంది. ఒళ్ళు పరవశమయిపోయింది. కడుపు నిండిపోయిందనుకున్నాడు. గుర్రం నొక్కాడు. దుప్పికింద పడిపోడం కోసం చూశాడు. కాని - కాని, సన్నమందు నిలగాలింది. గుర్రం చప్పుడికే దుప్పి ఉడాయించింది. తుపాకీ 'ధాం' అంది, పక్షులు గోలచెయ్యడానికి మాత్రమే! దొర ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. ఎప్పుడూ ఎరగడు అలాగు తప్పిపోడం. "కోనలమ్మకీ నామీద దయలేదు!" అనుకున్నాడు. గుడిసెకి బయలుదేరాడు. వెల్లటి నుంచి మన్నెంలో మేపడానికి తోలుకు వచ్చిన గొడ్లలో ఒకదానిని గూడెంలో సఫాచేశారు. బొర్రన్న దొర కడుపుకూడా నిండింది.

తను కొట్టివేసిన దిమ్మకి ఎగువని రొజాకి అడ్డంగా కాలవ పారుతూంది. కాలవలో వెనక ఎప్పుడో రాళ్ళు వేశారు, బళ్ళు సులువుగా వెళ్ళడానికి. ఇప్పుడారాళ్ళన్నీ ఇష్టం వచ్చినట్లు పడిఉండి అవి లేకుండా ఉంటేనే బండి ఎంతో బాగానడుస్తుందనిపిస్తుంది. దొర నాలుగు రోజుల పాటు శ్రమపడి ఆ రాళ్ళనన్నిటిని తవ్వి తీసి, పేర్చి, దారి మళ్ళా చక్కగా చేశాడు. దాని మీంచి బళ్ళు సుఖంగా వెళుతూంటే అతను బ్రహ్మానందపడ్డాడు.

కాలవలోకి దిగేదారి అటుగాని ఇటుగాని ఏమీ బాగా లేదు. ఒకవైపు ఎంతో ఎత్తుగాను, రెండోవైపు ఎంతో పల్లంగాను ఉండి, పైగా ఎంతో నిటారుగా ఉన్నాయి. బళ్ళు బోల్తాకొట్టడమే తరువాయి. ఎత్తుగా ఉన్నవేపు తవ్వివేసి ఏటవాలు ఎక్కువచేశాడు. పల్లంగా ఉన్నవైపు రాళ్ళుపడవేసి దారిసాపుచేశాడు. రొజాలోనే ఒక చోట ఒక పెద్ద బండరాయి నేలలో నుంచి పుట్టుకువస్తూంది. దాని పక్కనే చిన్న చిన్న రాళ్ళు అనేకం ఉన్నాయి. "అది రేపటి నుంచి మొదలెట్టవలసిన పని" అనుకున్నాడు దొర. మన్నాడు పొద్దున్న ఉలితోటి, సుత్తితోటి వెళ్ళి మొదట కొన్ని చిన్నరాళ్ళని సాపుచేశాడు. ఒక్క చిన్నరాళ్ళని సాపుచెయ్యడమే వారం రోజులు పట్టింది. ఆ తర్వాత పెద్దరాయిపని పట్టించాడు.

గూడెందొర లంతా అనుకున్నారు - బొర్రన్న దొరకి పిచ్చెత్తిందని. మురాదారు రొజాలో కొంత మార్పుచూసి కారణమేమిటని వాకబుచేసి, బొర్రన్న దొరకి పిచ్చెత్తిందని తెలుసుకొని ఒక పిసరు విచారించి, "ఏదయితేయేం? మనుష్యులని కొట్టకుండా ఇదీ మంచి ఉద్యోగమే, ఎవరికీ అపకారం లేనిపని ఏదో చేస్తున్నాడు, బాగానే కాలక్షేపమవుతూంది" అన్నాడు.

రొజా మీద వాలిన కిందికొమ్మలూ, బండీగూళ్ళకి తగిలే పైకొమ్మలూ, తెగకొట్టి, రొజా బాగుచేస్తున్నాడు బొర్రన్నదొర.

గూడెంచుట్టూ ఎంతో గాబు[12] ఉంది. గడ్డి మొక్కలూ, తుప్పలూ, పుట్టలూ నానాగాబుగానూ ఉంది. బొర్రన్నదొర ఈ మధ్య దానిని చూసి అనేకసార్లు పెదిమి విరిచాడు. దొర రొజా బాగుచెయ్యడం మొర్రెందొర చూశాడు. మొర్రెందొర వయస్సు అట్టేలేదు; పదిహేనేళ్ళు. పెద్దకళ్ళు త్రికోణం ముక్కు, పెద్ద పెదిమెలు, జుంజురుజుట్టు, పొట్టిగా మానులాగు ఉంటాడు. అతనుదొరతో "మామా! గాబుసంగతేమిటి?" అన్నాడు. దొర పెదిమివిరిచాడు. "నేనున్నాను" అన్నాడు మొర్రెం దొర, గుండెలమీద చెయ్యికొడుతూ. తీరుబాటు లేదన్నట్టుగా దొర ఊరుకుని బుర్రతిప్పివేశాడు. "అలాగకాదు. మా గాటుజట్టు[13] తయారవుతాం" అన్నాడు మొర్రెందొర. దొరమొహం ఇటువైపు

తిప్పాడు. మొహాన్ని మందహాసం ఉదయించింది. "అయితే నువ్వక్కడ కూచుంటేచాలు, మా గాటుజట్టు పనిచేసుకుపోతాం" అన్నాడు బుల్లిడి[14] ధీమాగా. దొర అప్రయత్నంగా బుర్ర ఆడించాడు. మొర్రం దొర సంతోషంతో పరుగెత్తి కొన్ని గుడిసెల దగ్గరికి వెళ్ళి కుర్రకారుని లాగుకువచ్చాడు. బొర్రన్నదొర తన మనస్సులో ఉన్న కోరిక ఫలిస్తూందని ఉబ్బిపోయాడు. మన్నాటి నుంచి పనిచేస్తామని గాటుజట్టంతా దొరని ఒప్పించారు. వారంరోజులలో గూడెంచుట్టూ నూరుగజాలవరకూ పరిశుభ్రం చేసేశారు. మొర్రెందొర "ఇపుడు పాముల్నిగాని, దోమల్నిగాని, నక్కల్నిగాని రమ్మను" అన్నాడు. బొర్రన్నదొర తన కడుపు నిండిపోయినట్టు ఆశుభ్రమైన స్థలాన్ని చూసి ఆనందం పట్టలేక అక్కడే చతికిలబడ్డాడు. కుర్రమూక అంతా అతని చుట్టూ చేరింది. అర్ధరాత్రిదాక బోలెడన్ని కబుర్లు చెప్పుకున్నారు.

బొర్రన్నదొర ఎప్పటిపని మీద బయలుదేరాడు. వెంట కుక్క కూడా వస్తూంది. ఎడమవైపు రిజర్వు అడివి, కుడివైపు మామ్మూలు అడివి. రొజామధ్యని ఒక తెల్ల మద్దిమోడు ఉంది. దాని పెద్దవేళ్ళు నేలపైని ఉండి, రాళ్ళకంటే ఎక్కువ బాధపెడుతున్నాయి. మోడుచుట్టూ ఊరికేచూశాడు. చీమలపుట్టని రాత్రే బంటి[15] బరికింది. ఈ మోడుని తెగకొట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇంతటిలో కుక్క బేజారెత్తి పోయి మొరిగింది. బొర్రన్నదొర వెనకా ముందూ చూశాడు. ఏమీ కనపడలేదు. రిజర్వు అడివివైపు చూశాడు. పచ్చని ఆకులగోడలోంచి కనపడేదేమిటి! అయినా పరిశీలించి చూశాడు. తనకి ముందు అయిదుగజాల దూరంలో ఏదో జంతువు ఆకులు, కొమ్మలలో కలిసిపోయి నట్టు కనబడింది. "మెకమా ఏమిటి!" అనుకుని పనిమానివేసి నిలుచున్నాడు. మరి కాస్త పరిశీలనగా చూశాడు; బండీచిందువు,[16] "మెకంతో సమానమైనదే!" కుక్కని ఎత్తుకు పోకుండా దగ్గిరికి లాక్కుని బుజ్జగించి, గొడ్డలితోటీ, కత్తితోటీ, కేకలతోటీ, చప్పుడుచేసి, బెదరించి, బండీచిందువుని తోలివేశాడు. మూడురోజులు తీసుకుంది, ఎండిపోయిన ఆ తెల్ల మద్దిమోడు నేలమట్ట మవడానికి.

ఎగువని రొజాలో ఒకచోట ఒక నలభై గజాల మేర అరికెచేనులోంచి మరొక దారి తీశారు బళ్ళవాళ్ళు. ఎందుచేత అంటే అంతకి మునుపు ఉన్నదారిలో ఒకవైపు బాగా గాడీ ఏర్పడిపోయి బండీతోలితే కుంచం నేలమీద రాసుకొంటూంది. అందుకని బళ్ళవాళ్ళు మరొకదారితీసి మళ్ళా కొంత ఎగువని రొజాలో కలిపివేశారు. కొత్తదారి సుఖంలేదు, రాళ్ళు, డొంక, పుట్టలు, బొర్రన్నదొర నాలుగురోజులు కష్టపడి అక్కడక్కడి రాళ్ళు తెచ్చి ఆగాడీ నింపి, వాటిమీద ఎర్రమట్టి పోసి చదునుగా తయారుచేశాడు. వాళ్ళని చూసి దొర పొట్ట చెక్కలయేటట్లా నవ్వుకున్నాడు! వీళ్ళు మనుష్యులేనా అని విస్తుపోయాడు! "కాస్త కష్టపడి దారి బాగుచేసుకో లేక పోయినా దారి బాగుపడితే మళ్ళా ఆదారినే వస్తారు. తెలివితక్కువ దద్దమ్మలు. కొంత శ్రమపడితే ఎంత సౌఖ్యపడతారో ఎరగరు. తమ పనికానట్టూ, తమకి సంబంధం లేనట్టూ, తమ ఖర్మమే ఇంత అన్నట్టూ ఊరుకుంటారు" అనుకున్నాడు తన నూతనదృష్టితో.

ఒకరోజు పొద్దున్న మొర్రెందొర బొర్రన్నదొర ఇంటికి వచ్చాడు. "మామా! నీకు సాయం చేద్దామంటే గెడ్డనికాచేవాళ్ళెవళ్ళూ? నువ్వు ఒంటరిగా తంటాలుపడుతూంటే నా మనస్సెంతో బాధపడుతూంది. పెద్దోళ్ళకి చెప్తే వాళ్ళకి తెలీదు. పైగా మనం చేసేదే తప్పుపని అని బోధపరచబోతారు. నాకేమీ తోచటం లేదు" అన్నాడు మొర్రెందొర. బొర్రన్నదొర ఆ విషయమై మాట్లాడలేదు; మొర్రెం దొర సానుభూతే పదివేలని లోలోపల సంతోషించాడు. రాజ వొమ్మంగి

సంతలో వస్తువులని గురించి కాస్తసేపు ముచ్చటించాడు. దొర తన పనిమీద లేచాడు. మొర్రెందొర గొడ్లని విప్పడానికి పోయాడు.

రొజాని అంటిపెట్టుకునే తాడిచెట్టొకటి ఉంది. ఇవతల వైపు బండరాయి, అవతలవైపు చెట్టు! ఈ ఇరుకులోంచి బళ్ళు వచ్చేటప్పుడూ వెళ్ళేటప్పుడూ అతి జాగ్రత్తగా నడిపిస్తేనే తప్ప ఇరుసు తాడిచెట్టుకి తగులుకుంటుంది. అక్కడి నుంచి నానా పీకులాట! బొర్రన్నదొర ఈ రోజున చెయ్యదలచుకొన్న పని తాడిచెట్టుని నేలమట్టం చెయ్యడం. క్రితం రాత్రే చిన్నజల్లుకొట్టింది. ఆ మాత్రానికే దోవంతా చిత్తడిగా ఉంది. చలిగాలి వీస్తూంది. పొద్దున్న సూర్యుడి ఎండలో చెట్లతడి ఆకులు గాజుముక్కలలాగు మెరుస్తున్నాయి. బొర్రన్నదొర చల్దిగంజి తాగి కత్తి, గొడ్డలి పుచ్చుకుని పనిమీద బయలుదేరాడు. కుక్క కూడా వెంటవస్తూంది. దానిని తరిమేడుగాని పోలేదు. వెనకకి తిరిగి తాను బాగుచేసిన దారి కనబడినంతవరకూ చూసి, తల ఆడించి, గొడ్డలితో చెట్టుపని మొదలుపెట్టాడు. కొంతసేపు కొట్టాడు. ఎందుచేతో ఎక్కువ అలసట అనిపించింది. కూచున్నాడు. కుక్కని దగ్గిరికి లాగుకొని కాస్తసేపు దానితో ఆటలాడాడు. మళ్ళీ లేచాడు. గొడ్డలితో రెండు దెబ్బలు వేశాడు. చెట్టు పెళపెళమంది. చెట్టులో ఉడతలు చేసిన తొర్ర ఉందనే సంగతి దొరకి తెలియదు. ఇంకా ఎంతోసేపటికి గాని పడదనే తలంపుతో ఉన్న దొర నమ్మకం లేక అక్కడే నిలుచున్నాడు. చెట్టు తనవైపే పడుతూంది. కిందికి వచ్చి వేసింది. దొర చేతులు పైకెత్తాడు, మీద పడకుండా అడ్డినట్టు. చెట్టుమీద పడిపోయింది. దొర మాంసం ముద్దయిపోయాడు. కుక్క దగ్గరికి వచ్చింది. వాసన చూసింది. మళ్ళీ కొంచెం దూరంలో కూచుంది. కొంతసేపు చూసింది. దొర లేవలేదు. దగ్గిరకి వచ్చి మళ్ళీ మళ్ళీ మూచూసింది. కెవ్వున కేక వేసి ఏడుపు మొదలు పెట్టింది. పుల్లలకోసం ఆ దారినే వెళుతూన్న లచ్చన్న దొర బొర్రన్నదొరని చూసి ఏడుస్తూ గూడేనికి వెళ్ళి పోయాడు. మరొక అరఘడియలో గూడెమంతా బొర్రన్నదొర శవందగ్గిరే ఉంది. అంతా గోలపెట్టారు. "పిచ్చివాడు చచ్చిపోయాడు" అన్నారు పెద్దవాళ్ళు. "బొర్రన్నదొర దేవుడయాడు" అన్నారు కుర్రకారు. రకరకాల అడవిపువ్వులు, పత్రి గంపలతో తెచ్చి, బొర్రన్నదొరని పూజచేసి, ఆ స్థలంలోనే గొయ్యితీసి దొరని సమాధిచేశారు. దానిమీద ఒక రాయి పడవేశారు. బొర్రన్నదొర చేష్టలు చెప్పుకుంటూ అంతా గూడానికి బయలుదేరారు. కుక్కమాత్రం సమాధి దగ్గిరే ఉండి అరుస్తూంటే ఎవడో దొర దానిని చెవిపట్టుకుని లాగాడు. రాలేదు. మరొకడు "అదే వస్తుంది పోరా" అన్నాడు. కుక్క చెవి విడిచిపెట్టి వేశాడు. అది తిరిగి సమాధి దగ్గిరికి వెళ్ళి ఏడవడం మొదలు పెట్టింది.

మొర్రెందొర కుర్రసజ్జుతో అన్నాడు. "బొర్రన్న దేవుణ్ణి తలుచుకుంటే ఒంటిని మైకం కమ్ముతూంది! " అని. మల్లిదొర "ఇంతవరకూ కోయకులంలో అటువంటి వాడు పుట్టలేదు, మహాత్ముడు!" అన్నాడు పరవశంతో. "దొరకి పండగచెయ్యాలి!" అన్నాడు బాలుదొర ఉత్సాహంగా. "రొజా మాటేమిటి?" అన్నాడు మొర్రెందొర గంభీరంగా. ఆపని దొర కిష్టమయినదని "మూడోవంతు మాత్రమే మిగిలింది" అన్నాడు సంకులమ్మ. మల్లిదొర కంట తడిపెట్టాడు. "దొర నాకు పని అప్పజెప్పాడు" అన్నాడు మొర్రెందొర గంభీరంగా. "దేవుడు! ఆయనకేం!" అన్నాడు పొట్టిదొర భక్తితో. అప్పుడే పనిని వంతులు వేసుకున్నారు. గూడెంలో ఉన్న పద్దెనిమిది యువకులలోనూ సగం మంది మిగతా పనులన్నీ చెయ్యడానికీ, తక్కిన సగం మందీ రొజా మరమ్మత్తు చెయ్యడానికీ!

కావలసిన సామగ్రి అంతా పట్టుకొని మన్నాడే బయలుదేరారు. బొర్రన్నదొర సమాధిదగ్గిర మొక్కేరు. అతనికి పూజచేశారు. "దొరకుక్కేది?" అన్నాడు పొట్టిదొర. "రాత్రి ఏ చిందువో తినేసుంటుంది!" అన్నాడు బాలుదొర. "ఆహా! ఏమి స్వామిభక్తి!" అన్నాడు మల్లిదొర తన్మయత్వంతో. కుక్కకి ఒక రాయి పాతేరు సమాధిదగ్గిర.

రొజా అంతా బాగుచెయ్యడానికి రెండు నెలలు పట్టింది. అంతమంది కలిస్తే రెండు నెలలు పట్టింది. బొర్రన్నదొర ఒక్కడే రెండువంతుల రొజా నాలుగు నెలలలో చేశాడు! ఎలాగ చేశాడో అని యువకులు ఆశ్చర్యపోయి తన్మయులయారు!

జమాబందీకోసం డిప్టీ కలెక్టరుగారు లాగరాయికి వస్తారని తెలిసింది. ఆయన క్రితం సంవత్సరం అనుభవం మీద "ఏ బండీ అక్కర్లేదు, రొజామీద నడిచేవస్తా" నని ముఠాదారుకి [illegible]ప్పాడు. ముఠాదారూ, మునసబూ కూడా "రొజాగచ్చు రోడ్డులాగుందండి" అని ఒకే సారి అన్నారు. డిప్టీకలెక్టరుగారు చిరునవ్వునవ్వారు; అంతకంటే సమాధానం చెప్పలేదు. తీరా ఆయన బయలుదేరి లాగరాయికివస్తూ రొజాస్థితిచూసి నిర్విణ్ణుడై పోయాడు. డిప్టీకలెక్టరుగారి బండీ బొర్రన్న దేవుడు ఉన్నచోట ఆగింది. ఆయన బండిదిగి ఆశ్చర్యపడ్డాడు : "లాగరాయి దొరలకి చాలా ఉపకారం చేశాడు దొర!" అన్నాడు నెమ్మదిగా. "ఆయన దేవుడయాడండీ!" అన్నాడు మునసబు భక్తితో. డిప్టీకలెక్టరుగారు చిరునవ్వుతో బండీ ఎక్కారు.

✸

ప్రతిభ, అక్టోబర్ 1938.

---

1. రొజా : మన్నెంలో బళ్ళదారి.
2. ఊబి : రొంపి.
3. వీధి : ఒకే కోయపల్లిలోని ఇళ్ళ గుంపు.
4. బుడప లేక బొడప : చిన్న కొండ.
5. బండలు : కోతులు.
6. అరప : మంచ.
7. ముఠాదారు : కొన్ని గ్రామాలకు జమిందారు.
8. పాదు : వెదురు బద్దలతో అరడుగు ఎత్తుగాను, రెండడుగులు పొడుగుగాను, కట్టబడ్డ చట్రాలు, ఒకదాని కొకటి లంకె వేసి ఉంటాయి. ఆ చట్రాల మధ్యని తాళ్ళతో అల్లబడిన ఉచ్చులు ఉంటాయి.
9. షికారీపిట్ట : పంజరములో ఉంచబడిన పిట్ట. అది అరవగానే అదే జాతి ఇతర పిట్టలు వస్తాయి. అవి పాదులో చిక్కుకుంటాయి.
10. కొత్తలు : పంటల దినుసులలో ప్రతిదానికీ చేసే మొదటి పండగ.
11. గజం : తుపాకీలో మందు దట్టించే ఇనపఊస.
12. గాబు : చెత్త, మొక్కలు వగైరా.
13. గాటు జట్టు : కుర్ర జట్టు.
14. బుల్లిడి : పదిహేనేళ్ళ మొగవాడు.
15. బంటి : వెలుగు బంటి.
16. బండీ చిందువు : చిరుతపులులలో పెద్దరకం.